రంగనాథంగారు అప్పుడే దంతావధానం పూర్తి గావించి, భుజం మీదున్న తుండుగుడ్డతో ముఖం తుడుచుకుంటూ ఉండగా, భార్య సావిత్రమ్మగారు ఇచ్చిన కాఫీ గ్లాసందుకొని, ఒక గుటక వేసి, ఆముదం మింగుతున్నట్లుగా ముఖం పెట్టి, "ఏమిటే అమ్మాయ్! ఈ కాఫీ ఉగాది పచ్చడిలా ఆరుచులు మేళవించి ఉంది. ఎలా తయారు చేశావేమిటి?" అన్నారు.


"ఏం చెయ్యమంటారు? పంచదార అయిపోయింది. బెల్లం వేసి కాచాను. క్రితం నెల కోటాలో రెండు కే. జీ. లు తగ్గించి ఇచ్చారు. ఎలాగో అదే ఇప్పటి వరకు కొంచెం కొంచెం వాడుతూ నిన్నటి వరకూ గెంటుకొచ్చాను. ఈ నెలలో సగం రోజులు గడిచిపోయినా, ఇంకా పంచదార ఛాన్సేలేదు. దానికి తోడు రెండు రోజులనుండి పంపుకూడా సరిగ్గా రావటం లేదు. చుక్క చుక్కలు పడుతూంది. ఆ ఇల్లుగలావిడ రాత్రే దాని కింద గుండిగలాంటి బిందె పెట్టేస్తూంది. అది నిండేసరికి పంపు పోనే పోతుంది. ఈ రోజు కాఫీకికూడా చెంబెడు మంచి నీళ్ళు లేక ఉప్పునీళ్ళే పెట్టి కాచాను" అంది.

ఆయన ఆముదం లాగా ఎలాగో ఆ కాఫీనీ తాగేసి, ఖాళీగ్లాసు ఆమె చేతి కిచ్చేసి పేపరు తీసుకున్నారు.

ఆమె వంటింట్లోకి వెళుతూ 'ఏడు దాటిపోయినా ఇంకా దాసీ రానేలేదు. ఇప్పుడు మొదలు పెడితేనే కానీ తొమ్మిదింటికల్లా వంట కాదు' అనుకుంటూ స్టవ్ వెలిగించి, పేరాక గిన్నెతో ఎసరు పడేసి, మరొక గిన్నె కాలేసి గ్లాసెడు చింతపండు పోసి, వేయిస్తూ, "అమ్మాజీ! ఏం చేస్తున్నావ్? పంపుకింది మామ్మగారి బిందె నిండిందేమో చూడూ" అని కేక పెట్టింది.

"పక్కబట్టలు సర్దుతున్నానమ్మా" అంటూ పంపు దగ్గరకు వెళ్ళి చూచి, వచ్చి, "మామ్మగారి బిందె ఇంకా నిండలేదు. సగం వరకు వచ్చాక, పంపు పోయింది" అంటూ చెప్పింది అమ్మాజీ.

'అల్లాగైతే పప్పులోకూడా ఉప్పు నీళ్ళే పొయ్యాలి. ఇక ఈ రోజు పప్పు ఉడికినట్లే' అనుకుంటూ ఉప్పునీళ్ళు పోసింది.




ఇంతలో ఫ్రెండ్ ఇంటికి పుస్తకం కోసం వెళ్ళిన బాబిగాడు "అమ్మా! అమ్మా!" అంటూ పరుగు పరుగున వచ్చి, "పంచదార ఇస్తున్నారే. అప్పుడే క్యూలో చాలామంది నిలబడ్డారుకూడాను" అని వగరుస్తూ చెప్పాడు.

కడిగిన బియ్యం బుట్టలోకి వాడేస్తూ "అన్నయ్యని కార్డూ, సంచీ తీసుకొని, త్వరగా వెళ్ళమను. మళ్ళీ అయిపోయిందంటాడు" అంది.

"అన్నయ్య నీళ్ళు పోసుకుంటున్నాడే" అంది, చవటాలో చాప వేసుకుని కూర్చుని హోమ్‌వర్కు చేసుకుంటున్న పద్మ.

నీళ్ళగదిలోనుండి ఈ మాటలన్నీ విన్న గోపి—"అయిపోయింది. వచ్చేస్తున్నాను. ఈ లోగా కార్డూ, సంచీ, డబ్బూ రెడీగా ఉంచండి" అంటూ కేక పెట్టాడు.

సావిత్రమ్మగారు కొడుకు కేక విని వంటింట్లోంచి, "అమ్మాజీ! పంచదార కార్డూ, సంచీ తీసి నాన్నగారి నడిగి డబ్బు పుచ్చుకో" అంది.

అమ్మాజీ పంచదార కార్డు కోసం డెస్కు, అలమారు, సంచీ కోసం చిలక్కొయ్య, దండాలు, తలుపుల వెనకనున్న గడియలు అన్నీ వెతికింది. రెండూ కనిపించలేదు. వెళ్ళి తండ్రి నడిగింది. ఆయన పేపరు చదువుకుంటూ, "నేను తీస్తేమటుకు ఎక్కడ పెడతాను? నా డ్రాయరుసొరుగులో పెడతాను. కాగితాలూ అవీ కింద పడేయకుండా జాగ్రత్తగా చూడు" అన్నాడు. డ్రాయరు సొరుగు లాగి చూసింది. ఆఫీసు కాగితాలూ, పిప

## బంధకవి సరోజినిదేవి

బిల్లులూ, పాత ఉత్తరాలతో నిండిపోయి సుగ్రీవవనంలా ఉంది. అటూ ఇటూ ఒకసారి కాగితాలను తిరగేసి, చూస్తూంది. ఇంతలో దాసీ వచ్చి, "అంట్లు పడెయ్యండమ్మగారూ" అని, "ఆ నేలో నే చింతపండుకూడా పడెయ్యండి" అంటూ కేకేసింది. వంటింట్లో అప్పం వారుస్తున్న సావిత్రమ్మగారు "హుం కే. జీ. అయిదు రూపాయలు అమ్ముతూ ఉంటే, పనస్తానే చింతపండు పడెయ్యండంటూ పనస్తోంది. పోనీ, ఒక్క గిన్నె తెల్లగా తోమి తగలడదు. గిన్నెలకే పెడుతుందో, బొట్టల్లో దోపుకు పోతుందో తెలియదు' అని మనస్సులో అనుకుని, "మరీ ఇంత ఎండెక్కి వచ్చావేమిటే?" అంది.

"రాత్రి రెండో ఆట సినిమా కెళ్ళానమ్మా. మెలకువ రానేదు" అని, "తొందరగా అంట్లు వెయ్యండి" అంటూ తొందర పడసాగింది.

"ఉండు. నా చెయ్యూరు కోలేదు" అని, "కమలా! కాస్త ఒకసారి ఇలా వచ్చి అంట్లు పడేయ్" అని కేకేసింది.

స్నానానికి బయలుదేరిన కమల, "నాకు స్కూలుకి టైమైపోతూంది. నే నీళ్ళు పోసుకోటానికి వెడుతున్నాను. అక్కయ్యని వెయ్యమను బాబూ" అంటూ నీళ్ళగదిలోకి వెళ్ళిపోయింది.

ఒక మూల కార్డు వెతుకుతూనే ఈ మాటలన్నీ వింటున్న అమ్మాజీ, "అమ్మా, నేను పంచదార కార్డు వెతుకుతున్నాను. కనిపించటం లేదు. పద్మని వెయ్యమను" అంటూ కేకేసింది. ఆ మాట విని పద్మ, "నాకు ఒక్క పాఠం రాలేదు. నేను

# త్రిశంకు స్వర్గం

... అంది. ఇంతలో అద్దం ముందు నిలుచుని, క్రాఫు దువ్వుకుంటూ, "ఇందాకటి నుండి కార్డు కనిపించలేదా? త్వరగా వెతుకు. నువ్వు నాకు కాలేజీకి టైమైపోతుంది" అని తొందరపెడ సాగాడు గోపి.

"సంత్తమ్మాయ్! ఇక్కడే మధ్యనే అయి లాగుంది. మీ లొక్కలే నేటి దూకు సుండటాన్కి? ఓ రింటి కావస్యంగా సేదిలే, అవి కయ్ పుంటారు. తొరగా ఒంట్ల దెయ్యండి" అంటూ బోయ్ పుంటూంది దాసీది.

చింతకాయ పచ్చడిలోకి పోపు వేయిస్తూ, మధ్యలో ఒకసారి పప్పు గిన్నె మూత తీసి చూసి, 'ఇంకా ఈ మాయదారి పప్పు ఉడకనే లేదు' అనుకుంటూ పోపు వేయించి, మూకుడు పక్కన పెట్టేసి, బయటికి వచ్చి, "ఎనిమిదింటికి వచ్చి ఏమిటే ఆ తొందర? ఈ లోగా నీళ్ళు తోడుతూ ఉండు. అంట్లు డేస్తాను" అంటూ సావిత్రమ్మ గారు పెరటి గదిలోకి వెళ్ళింది కార్డు కనిపించిందో ఏదోనని.

"ఆ సంగతి మీరు చెప్పాలేటి? ఇందాకే మాతి కాడ కెడితే ఇంటావిడ పడిబట్టి ఆరేసుకున్నారంట. కూసింత సేపాగి రమ్మన్నారు" అని గొణుక్కుంటూ, "పరి గంటైతే ఆ సీతమ్మ గోరింటి కాడకేనా ఎల్లొస్తాను" అంటూ వెళ్ళింది.

ఇంకా వెతుకుతూనే ఉన్న కూతురుతో బాటు తనుకూడా నాలుగు మూలలా వెతుకుతూ, క్రాప్ సరిగ్గా వచ్చిందో లేదోనని మరోసారి అద్దంలో చూసుకుంటూ, "బ్యా పెరిగిపోతుందే, తొందరగా వెతకండి" అంటున్న గోపీతో, 'అలా అద్దంలో చూసుకుంటూ, తొందర పెట్టకపోతే నువ్వుకూడా వెతక రాదూ?' అని, ఈ గొడవేమీ పట్టించుకోకుండా పేపరులో లీనమైపోయిన రంగనాథంగారితో "పంచదార కార్డు కాస్తా పోయిందేమిటండీ, కర్మ!" అంది.

ఆయన ఒకసారి పేపరులోంచి ముఖం బయటికి పెట్టి, "ఇదిగో, పోయిన నెల పంచదార ఎవరు తెచ్చారు? వాళ్ళే ఎక్కడో పెట్టి ఉంటారు. కనుక్కోండి" అన్నారు.

అక్కడే కూర్చుని లెక్కలతో కుస్తీ పడుతున్న బాబిగాడు టక్కున "అన్నయ్యే తెచ్చాడు" అన్నాడు.

ఏ సంగతీ పట్టించుకోని రంగనాథం గారు పెద్ద కొడుకు సంగతి ఏదైనా వస్తే మాత్రం వెంటనే కల్పించుకుంటారు. వెంటనే ఆయన— "నేను చెప్పలేదూ మరి వాడికి మతి మరుపెక్కువని? అందుకనే రోజూ నెత్తి మీద స్నానం చెయ్యరా, జ్ఞాపకశక్తి, తెలివి తేటలుకూడా పెరుగుతాయి అంటే, వింటేగా? వాడే ఎక్కడో పడేసుంటాడు" అన్నారు.

తండ్రి మాటలు విన్న గోపీ ముఖం కందిపోయినట్లా చేసుకొని, "నేనేం పారెయ్యలేదు. క్రితంసారి పంచదార తెచ్చినప్పుడు కాలేజీకి టైమైపోయిందని పంచదార సంచిలోనే కార్డుకూడా పెట్టేసి, కమలకిచ్చాను" అన్నాడు.

అప్పుడే నీళ్ళు పోసుకొని వచ్చి, అద్దం ముందు నిలుచుని, ముఖానికి పౌడరు పెట్టుకుంటూ కమల—"పంచదార డబ్బాలో పోసి, కార్డు నాన్నగారికే ఇచ్చాను" అంది.

"మీకే ఇచ్చిందిటండీ" అంది సావిత్రమ్మగారు.

"ఆయన రోజూ నెత్తిమీద స్నానం చేస్తూనే ఉన్నారు కదా? ఆయన జ్ఞాపకశక్తి ఏమైందో?" అన్నాడు మెల్లిగా గోపీ.

"నాకిస్తే నే నెక్కడ పెడతానే? డ్రాయరులోనే పెడతాను" అంటూ ఉండగా వాసు సంచీ పట్టుకుని వస్తుండటం చూసి, "అన్నట్లు మరిచి పోయాను. పొద్దున్నే శాస్త్రిగారు చౌక డిపోలో పప్పులిస్తున్నారని చెపితే వాసును కార్డూ, సంచీ ఇచ్చి పంపాను" అన్నాడు.

"బాగానే ఉంది. ఇందాకటి నుంచి వెతుక్కు చస్తూ ఉంటే మీకు జ్ఞాపకమే రాలేదా?" అని వాసుకేసి తిరిగి, "ఏవిరా పప్పులూ?" అంది సావిత్రమ్మగారు.

"ఇవ్వలేదు. పదిమందికిచ్చి, స్టాకయి పోయింది. మళ్ళీ నాలుగు రోజులు పోయాక రమ్మన్నాడే" అన్నాడు వాసు.

"అప్పుడే ఎనిమిది దాటిపోయింది. ఇలా తే సంచీ, కార్డూ" అంటూ గోపీ వాసు చేతిలోంచి తీసుకొని వెళ్ళాడు.

వంటింట్లోంచి పప్పు మాడు వాసన కొడుతుంటే 'అయ్యో!' అనుకుంటూ సావిత్రమ్మగారు వంటింట్లో కెళ్ళి పప్పులో గ్లాసెడు నీళ్ళు పోసి 'ఇంకా ఉడకలేదు' అనుకొని, "ఒరేయ్, కిష్టిగా! లింగయ్య కొట్లో కెళ్ళి అయిదు పైసల కడుపు నొప్పి సోడా పట్టుకురా" అని కేకేసింది.

* * *

గోపీ కొట్టు దగ్గరకు వెళ్ళేసరికి ఇంకా కొట్టు తెరవలేదు. కానీ, అప్పుడే 'క్యూ' కొల్లేటి చాంతాడంత ఉంది. తనుకూడా వెళ్ళి నిలబడ్డాడు. తరవాత అతని పక్కనే ఓ డవాలా బంట్రోతు బిందె పుచ్చుకొని వచ్చి నిలబడ్డాడు. హనుమంతుడి తోకలా 'క్యూ' అలా పెరిగిపోతూనే ఉంది.

"ఏమిటయ్యా, బిందె పుచ్చుకొని వచ్చావు? ఇద్దరు మనుషుల చోటు





ఆక్రమించటమే కాకుండా మోకాళ్ళని చెప్పులకేసి ఒకటే టకీమని ఏ డుతున్నావ్? పైకెళ్ళి ఎక్కుకో'' అంటూ గదమాయించాడు, పెక్కటను.

''ఏం చెయ్యమంటారు, బాబూ? పోయిన సారి సంచీ పెట్టుకొని వస్తే, వెక్కిసలా ఏదో అంచి ఓడికిలు కాళికలు అయిపోయింది. అందుచేత ఈ సారి ఏదో అమ్మగారు బిందె ఇచ్చారు'' అంటూ బిందెను పైకెత్తి పట్టుకున్నాడు.

తొమ్మిదవుతున్నా షాపు ఉసురు ఇంకా రాలేదు గానీ, 'క్యూ'లో తోసుకోవటాలు మాత్రం ఎక్కువైపోయాయి.

• • •

సావిత్రమ్మగారు పచ్చడి రుబ్బుతూ, ''ఇప్పుడే వస్తానని చెప్పి, ఇంతవరకూ రానేలేదు అప్పి, అమ్మాజీ! కాస్త నాలుగు గ్లాసులూ, కంచాలూ తోమి పడేయమ్మా'' అంది.

''హుం. పనిమనిషి ఉండన్న మాటే గానీ, ప్రతి రోజూ సగం అంట్లు తోముకున్నాకే వస్తుంది. అటువంటప్పుడు ఎందుకమ్మా అది?'' అని విసుక్కుంటూ కంచాలు తోమటానికి పట్టుకెళ్ళింది అమ్మాజీ.

''అమ్మా! నా యూనిఫారమ్ మాసిపోయింది. యూనిఫారమ్ వేసుకోకపోతే పది పైసలు ఫైన్ వేస్తారు'' అంటూ సణుగుడు మొదలు పెట్టింది పద్మ.

''సబ్బయిపోయిందే. కొట్లలో సబ్బుల ఖరీదు చాలా పెంచేశారు. సూపర్ బజార్ నుంచి తెప్పించి ఉతుకుతాలే. ఈ రోజుకి ఏదో సర్ది చెప్పు. లేకపోతే ఫైన్ కట్టు. నన్ను వేధించుకు తినక'' అంటూ విసుక్కుంది సావిత్రమ్మగారు.

ఇంతలో రంగనాథంగారు ఆఫీసుకు టైమైపోయిందనీ, పిల్లలు స్కూళ్ళకు టైమయిపోయిందనీ భోజనం పెట్టమని వచ్చేశారు.

''ఇంకా మాయదారి పప్పు ఉడకనే లేదు. ఆ కిష్టిగాణ్ణి చిటికెడు సోడా తేరా అని పంపి గంటైంది. ఏ గోళీలాట చూస్తూ నిలబడిపోయాడో, వెధవ! ఒక్క అయిదు నిమిషాలాగండి, ఆ పప్పుని రోట్లో వేసి రుబ్బి, పప్పు పులుసు కిందైనా పడేసి, రెండు వడియం ముక్కలు వేయిస్తాను'' అంది సావిత్రమ్మగారు.

''ఇప్పుడింకేమీ చెయ్యొద్దు. అయిన మట్టుకు పెట్టేసేయ్. కాస్త ఆలస్యంగా వెళితే చాలు ఆ ఆఫీసరుగాడు పెద్ద నాడిని కూడా ఇంత ఆలస్యంగా వస్తే ఎలాగయ్యా? అంటూ నలుగురి ముందూ చీవాట్లు వేస్తాడు. సాయంత్రం పోసుకుందాలే పప్పుచారు'' అన్నారు రంగనాథంగారు.

''ఉండండి. వడియం ముక్క అయినా వేయిస్తాను'' అంటూ మూకుడ్లో చమురు పోసి నాలుగు వడియాలు వేయించిందో లేదో ''టప్ టప్'' మంటూ చప్పుడై స్టవ్ కాస్తా ఆరిపోయింది.

'అయ్యో! గాస్ అయిపోయినట్టుంది' అనుకుంటూ కిరసనాయిలు స్టవ్ తీసింది. అందులో కిరసనాయిలు లేదు. దానితో- ''ఒరేయ్, వాసూ! అన్నం వడ్డించేలోపుగా లింగయ్య కొట్టుకి వెళ్ళి రెండు లీటర్ల కిరసనాయిలు పట్టుకురా. ఆ కిష్టిగాడు ఇంకా రావేలేదు. ఏ సిగరెట్ ముచ్చి రేకులు ఏరుకుంటున్నాడో ఒక్క మొట్టికాయ వేసి లాక్కురా'' అంది సావిత్రమ్మగారు.

వాసు ఒక్క పరుగున కొట్టుకెళ్ళి వచ్చి, ''అమ్మా! కొట్లవాళ్ళు కిరసనాయిలు బాగా ఎక్కువ ధర కమ్ముతున్నారని, కొట్లలో అమ్మనివ్వటంలేదట అక్కడెక్కడో పాకడిపో పెట్టి మనిషికి రెండు లీటర్ల కిరసనాయిల్ ఇస్తున్నారట'' అన్నాడు.

''సరేలే, అక్కడికి వెడితే ఈ రోజుకిక వంట పూర్తయినట్టే. కాసిని పుల్లలూ, బొగ్గులూ అయినా తెచ్చి పడేయ్'' అంది.

''నాకు స్కూలుకు టైమైపోతోంది. అప్పిచేత తెప్పించుకో'' అంటూ వచ్చేసి అన్నానికి కూర్చున్నాడు వాసు.

వాసు పుస్తకాలు పట్టుకొని గుమ్మం దిగుతుంటే, గోపీ వడి వడిగా వచ్చి, ''ఒరేయ్! నాకు కాలేజీకి టైమైపోయింది. ఇంకా చాలా మంది ఉన్నారు. ఈ పూటకి నువ్వు స్కూలు మానేసి వెళ్ళి క్యూలో నిలబడరా. ఓ దవాలా బంట్రోతు బిందె పుచ్చుకొని ఉంటాడు. వాడి పక్క నుంచో'' అని గుర్తు చెప్పి కార్డూ, సంచీ ఇచ్చాడు.

పుస్తకాలు సర్దుకుంటున్న గోపీని చూసి, ''పంచదార ఏదిరా?'' అంది సావిత్రమ్మగారు.

''తేలేదు. ఇంకా చాలా మంది జనం ఉన్నారు. వాసుని నించోమని నేను కాలేజీకి వెడుతున్నాను'' అన్నాడు గోపీ.

''మరలాగైతే కాస్త అన్నం తిని వెళ్ళు.''

''ఊహూఁ! టైము లేదు. మధ్యాహ్నం వచ్చి తింటాలే'' అన్నాడు.

''అలాగైతే దారిలో గాస్ వాడికి పేరిచ్చి, సూపర్ బజార్లో సబ్బులు చవకట రెండు సన్‌లైట్ సబ్బులు, రెండు హమామ్ సబ్బులు పట్రా'' అంది సావిత్రమ్మగారు.

• • •

వాసు ఒకచేత్తో జేబును గట్టిగా పట్టుకుని మరొక చేత్తో కార్డూ, సంచీ గట్టిగా పట్టుకుని మెల్లిగా నెట్టు

అంటూ వచ్చి బిందె బంట్రోతు దగ్గర కు చేరుకున్నాడు.

"ఏమిటోయ్! ఇప్పుడొచ్చి ఇబ్బర్ స్తాగా ముందుకొచ్చి నుంచుంటున్నావ్?" అన్నా డొక పెద్దమనిషి.

"లేదండీ, ఇప్పటిదాకా మా అన్నయ్య ఇక్కడ నించున్నాడు. ఇప్పుడే తను వెళ్ళి నన్ను నించోమన్నాడు."

"చాలు చాల్లే. కబుర్లు కట్టిపెట్టి వెనక్కెళ్ళి నించో" అంటూ గదమా యించాడు ఒక విద్యార్థి యువ.

"పోన్లెండి. ఏదో, కుర్రాడేదో చెప్పు తున్నాడు కదా నించోనివ్వండి" అన్నాడు మరో ఉదార హృదయుడు.

అప్పుడే తలుపులు తెరిచి, పంచదార ఒక్కొక్కళ్ళకే ఇస్తున్నారు. ముందునిలిచి, వెనకనుంచి నెట్టుకోవటంతో బిందె ఒకసారి ముందున్నతనికి, మరోసారి వెనక ఉన్న తనకీ తలకి కొట్టుకుంటూనే ఉంది. వారి పక్కనే ఓ మురికి గుంట కూడా ఉంది. ఈ తోసుకోవడాలలో అందులో ఎక్కడ పడిపోతారోనని అందరూ జాగ్రత్తగానే ఉన్నారు.

ఇంతలో ఉన్నట్టుండి ఒకతను "కళ్ళు కనిపించటం లేదేమిటి? నా కాలు ఎప్పుడి చేసినావు గదయ్యా" అంటూ ఒక తోపు తోశాడు. దానితో బిందె ముందతనికి తగిలింది.

"నీ బిందె పాడుగానూ! నా తల బద్దలు కొట్టేవావు కదయ్యా. బొప్పి కూడా కట్టింది" అంటూ అత నొక నెట్టు నెట్టాడు.

ఈ తోసుకోవటంతో వాను బురద కుంటలో పడ్డాడు. ఇంతలో షాపు ఓనరు—"పంచదార అయిపోయింది" అంటూ తాళం పెట్టేస్తున్నాడు. అందరూ బిలబిలమంటూ వెనక్కి తిరిగారు.

మురికి గుంటలోంచి వాసు లేచి చూసుకునేసరికి చేతిలో కార్డు లేదు. "అయ్యో, నా కార్డు" అంటూ చూశాడు. ఎక్కడా కనిపించలేదు.

• • •

ఒళ్ళంతా బురదతో ఉసూరు మంటూ వచ్చిన వాసుని చూచి, సావి త్రమ్మగారు, "అదేమిట్రా? ఆ ఒళ్ళంతా బురదేమిటి? పంచదార ఏది?" అన్నారు.

"పంచదారా లేదూ, పాడూ లేదు. ఆ వెధవ 'క్యూ'లో తోసేశారు. బురద గుంటలో పడ్డాను. కార్డు కాస్తా పోయింది" అన్నాడు, ఏడుపు ముఖం పెట్టి.

"ఏడిసినట్లే ఉంది. ఇక ఈ వేళంతా బెల్లం కాఫీ తాగవలసిందే. మళ్ళీ ఆఫీసుల చుట్టూ తిరిగి కొత్త కార్డు సంపాదించే సరికి తాతలు దిగొస్తారు. ఆ బట్ట లక్కడ వడేసి నీళ్ళు పోసుకో. పొద్దున్న అనవసరంగా స్కూలుకూడా పోయింది. నాలుగు మెతుకులు తిని బడికి పో."

• • •

"అమ్మాజీ! పాలవాన్ వచ్చేవేళయింది. పాలసీసాలు తెచ్చే టైములో, నాలు గిళ్ళలో పాచిపని చేసుకోవచ్చును. ఈ వేళ నుండి పాల సీసాలు తేవటం నా వల్ల కాదు అంది దాసీది. కాస్త నువ్వెళ్ళి ఆ పాలసీసాలు పట్టుకొద్దూ" అంటూ బతిమాలింది కూతుర్ని సావిత్రమ్మ గారు.

"నా బట్టలు బాగాలేవు. అక్కడకు వెళ్ళి ఆ క్యూలో నించోవటం నాకు సిగ్గు బాబూ" అంది అమ్మాజీ.

"నా తల్లివి కదూ! ఆ పెట్లో సిల్కు పరికిణీ కట్టుకుని ఈవేళటికి ఎలాగో అలా తేవే, అమ్మా. రేపటి సంగతి రేపు చూసుకోవచ్చు" అంది సావిత్రమ్మగారు.

గంట పోయిన తరవాత "అమ్మా! ఈ రోజు నుంచి పాలసీసాలు తగ్గించే శారు. ఒక్క సీసాయే ఇస్తారుట" అంటూ ఒక్క సీసా పట్టుకు వచ్చింది అమ్మాజీ.

"ఒక సీసా కాఫీలకే సరిపోతుంది. ఇంతమందిమి మజ్జిగేమి పోసుకుంటాము," అంటూ నిట్టూర్చి, కుంప టంటించి, కాఫీనీళ్ళు పడేసింది సావిత్రమ్మగారు.

ఇంతలో పెద్దకొడుకు కాలేజీనుంచి వచ్చి, "వారం రోజుల దాకా గాస్ రాదుట. మార్కెట్ బజార్‌లో పళ్ళాలు తేవుట. బయట రెండు రూపాయలు పెట్టి తెచ్చాను" అన్నాడు.

'కాను రేవువు, చౌకడిపోలు అనిపేరుకే కానీ ఒక్కనాడూ ఒక్క వస్తువయినా ఇచ్చిన పాపాన పోరు' అనుకుంది.

మరి కొంతసేపటికి భర్త ఆఫీసు నుండి, పిల్లలు స్కూళ్ళనుండి వచ్చారు. నేతివెయ్యకుండా ఒక్క పాలుముక్క, బెల్లమూ వేసి కషాయం లాంటి కాఫీ తలో ముక్కా ఇచ్చింది.

ఇంతలో దాసీది "ఈయాలతో పని పుచ్చుకుంటున్నా నమ్మగోరూ. నా డబ్బులు నాకు లెక్క చూసి పారెయ్యం డమ్మా" అంది.

"ఎందుకనే?"

"నాను చెయ్యలేనండమ్మా. పంపు నూడబోతే సుక్కసుక్క పడుతోంది. నూతిలో నీళ్ళు లాగేసరికి పేగులు తెగి పోతున్నాయం డమ్మా" అంది.

గుండెలో రాయి పడింది సావి త్రమ్మగారికి. కొన్నాళ్ళు గడిచినా గడవటమేనని, "మధ్యలో మానట మెందుకు? పెళ్ళారు వరకు చెయ్య" అంది.

ఇక దాపరికమెందుకని—"నాకు గిట్టటం లేదండమ్మగోరూ. మాత్తానే ఉన్నారు గంద, అన్ని ధరలు ఎట్టా మండిపో తున్నాయో? రోజూ కాసిని కాఫీనీళ్ళిచ్చి మనిషన్నం పెట్టి, ఇరవై రూపాయ లిస్తేనేగానీ నాను చెయ్యలేనం డమ్మ గోరూ" అంది దాసీది.

"మాకే పాలూ, పంచదారా దొరకటం లేదు. బియ్యం ధర చూస్తే అంత కంటే మండిపోతోంది. సరేలే! నీకు రావలసిన డబ్బులు రేపు లెక్క చూసుకుని పట్టుకోపో" అంది సావిత్రమ్మగారు.


బయటి నుండి పద్మ హడావుడిగా వచ్చి, "అమ్మా! 'బంగారు కలలు' సినిమా బాగుందట. అందరూ వెళు తున్నారు. 'మీరా' తరవాత మళ్ళీ సినిమాకి వెళ్ళలేదు. సినిమాకి వెళదా మమ్మా" అంటూ మారాంచెయ్యటం మొదలెట్టింది.

'ఇంటిల్లిపాది సినిమాకి వెడితే పాతిక, ముప్ఫయి రూపాయ లవుతాయి' అను కుంది, సావిత్రమ్మగారు మనస్సులో.

అక్కడే కాఫీ నిమంలా తాగుతూ తల్లి టిక్కెట్లకోసం మళ్ళీ ఎక్కడ క్యూలో నిలబడమంటుందోనని భయ పడుతూ, "అమ్మా! మూడింటికి వెళ్ళి 'క్యూ'లో నిలబడితే మనిషికి రెండు టిక్కెట్లు ఇస్తున్నారు తెలుసా?" అన్నాడు గోపి.

'నాలుగు వారాలు పోయాక వెడదాం లేవే' అని పద్మనెప్పి సావిత్రమ్మగారు వంటింట్లోకి వెళ్ళి కట్టెల పొయ్యి వెలిగించి, వంట ప్రయత్నం చేస్తూ, 'బంగారు కలలట! పెరిగిపోయిన సంపా రాలు, జాలివాలి జీతాలు, ఆకాశాన్నంటు తున్న ధరలు, రోజూ ఏదో 'క్యూ'లోనే గడిచిపోయే బతుకులకు బంగారు కలలు కూడా వస్తాయా బాబూ,' అనుకుంటూ మెట్లో బియ్యం పోసి, పొయ్యిలో పుల్లలు ఎగదోస్తూ, మంట కేసి చూస్తూ ఆలోచిస్తూ కూర్చుంది.

'రేపటినుంచి పనిమనిషి కూడా రాదు. తొమ్మిదింటికల్లా వంట కావాలి. గాస్ కూడా లేకపోవటం. పాలకి కరువు, పంచదారకి కరువు, నీళ్ళకి కరువు. తెల్లారి లేస్తే అన్నిటికీ ఇబ్బందే.' అనుకుంటూ రోజులు త్రిశంకుస్వర్గంలా కనిపించాయి. ఇంతలో చీకటి పడింది. ఉన్నట్టుండి లైట్లారిపోయాయి. ప్రస్తుతానికి ఈ కరెంటు కోత ఒకటి. 'మళ్ళీ రెండు గంటలు పోతేనేగానీ రావు' అనుకుంటూ, "కమలా! నాలుగు కొవ్వొత్తులు వెలిగించి పెట్టు" అంటూ, మంటకేసి చూస్తూ కూర్చుంది సావిత్రమ్మగారు. ★



వెతికందిన కాయలు

ఫోటో...ఎల్. కె. రావు (ఉదయమండలం)